క్లుప్తంగా

కళాభిమానం చాటుకున్న కలెక్టర్ గౌతమ్



కలెక్టర్ గౌతమ్‌కు అభినందనలు తెలుపుతున్న నెలనెలా వెన్నెల నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: కళాకారులను వివిధ అంశాల్లో ప్రోత్సహించి కళాభిమానం చాటుకున్న కలెక్టర్ వీపీ గౌతమ్ జిల్లాతో ఉన్న అనుబంధం మరువలేనిదని నెల నెలా వెన్నెల నిర్వాహకులు డాక్టర్ నాగబత్తిని రవి, అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్ రావులు అన్నారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్‌ను శనివారం నెలనెలా వెన్నెల నిర్వాహకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళలు, కళాకారులపై ఉన్న ఆదరణతో కలెక్టర్ గౌతమ్ భక్త రామదాసు కళాక్షేత్రం అభివృద్ధికి తోడ్పాటునిచ్చారన్నారు.

నేడు 'కపిరాజు' ప్రదర్శన

నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 'కపిరాజు' నాటిక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్ రావు, డాక్టర్ నాగబత్తిని రవిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు నాటికను ప్రదర్శిస్తారని, కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అపరాధ రుసుము లేకుండా పన్ను చెల్లించండి

ఖమ్మంమయూరిసెంటర్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నులను అపరాధ రుసుము లేకుండా చెల్లించేందుకు సెప్టెంబర్ 30 వరకు వెసులుబాటు ఉందని, ఇంటి యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు బిల్ కలెక్టర్లకు, మీసేవా కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో తమ పన్నులు చెల్లించవచ్చన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర పాలకసంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కవాతును జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి మూడు దశాబ్దాల సందర్భంగా వరంగల్‌లో జులై 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తూరుగంటి అంజయ్య కోరారు. శనివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, సైదులు, జనార్దన్, నాగేశ్వరరావు, మోహన్, రాములు, వీరన్న, ఏసు, నాగరాజు, శ్రీను, వెంకటరత్నం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలం టెండర్లు ఉపసంహరించుకోవాలి

నేలకొండపల్లి: స్థానిక బస్టాండ్ స్థలం టెండర్ ప్రకటనను ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. టెండర్‌ను నిలిపివేయాలని కోరుతూ శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. దాతలు ఇచ్చిన బస్టాండ్ స్థలం ను గత పాలకులు లీజ్‌లకు ఇచ్చారని ఆరోపించారు. టెండర్లు నిలిపివేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పగిడికత్తుల రామదాసు, చిర్రా భిక్షం, డి.రామదాసు, అర్జున్‌రావు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ రాళ్లు తొలగించాలి

తిరుమలాయపాలెం: మండలంలోని జూపెడ హస్నాబాద్ వెళ్లే డొంక రహదారిపై ఒక రైతు ఫెన్సింగ్ రాళ్లు పాతాడని వీటిని తొలగించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం రైతులు తహసీల్దార్ పి.వి రామకృష్ణ, ఎస్సై గిరిధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రాళ్లు పాతిన రైతు చుట్టు పక్కల రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయించుకుని అనాదిగా ఉన్న డొంకకు అడ్డుగా ఫెన్సింగ్ రాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు వీరబాబు, నవీన్, ఆంజనేయులు, లచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉప్పలయ్య, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	హరోం హర
సాయిరాం	ఇంద్రాని
ఆదిత్య	రాజధాని రౌడీ
శ్రీనివాస	మహారాజ
సుందర్	లవ్‌మౌళి

– ఖమ్మం గాంధీచౌక్

కంపుకొడుతున్న బైపాస్..

తారురోడ్డుపైకి చేరుతున్న మురుగు నీరు

- డ్రెయినేజీలు లేక సమస్య
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు





బైపాస్ రోడ్డుపై పారుతున్న మురుగు నీరు..

ఖమ్మంఅర్బన్: ఒకవైపు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. మురుగునీరు నిల్వలు ఉంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పారిశుద్ధ్య పరిరక్షణకు కార్పొరేషన్ ప్రచారం చేస్తుంటే బైపాస్ రోడ్డులో మాత్రం మురుగునీరు నిలిచి కంపు కొడుతోంది. నగరం నడిబొడ్డున ఎన్టీఆర్ సర్కిల్ దాటిన తర్వాత డిగ్రీ కాలేజీ విద్యార్థుల హాస్టల్ భవన సముదాయం ఆనుకుని ఉన్న రోడ్డులో డ్రెయినేజీలు లేక తారురోడ్డుపైకి మురుగునీరు చేరుతోంది. రాష్ట్రీయ రహదారిగా ఉన్న రోడ్డుపై నిత్యం వేల సంఖ్యలోనే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బీసీ భవనం, కాలేజీ విద్యార్థులకు హాస్టల్ సముదాయం ఉన్న భవనాల ఎదురుగా డ్రెయినేజీ లేకపోవడంతో మట్టి డ్రెయినేజీలో మట్టితో కాల్వ పూడకపోయి మురుగు నీరు రోడ్డు అంచున పారుతుంది. వర్షం వస్తే రోడ్డు డ్రెయినేజీగా మారుతుంది. అనేక గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వాకర్లు నిత్యం ఆ రోడ్డులోనే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అక్కడి వచ్చే సరికి ముక్కులు మూసుకుని ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. మురుగు రోడ్డుపై పారడంతో మురుగు నీరు తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలోని ఎక్కడో మారుమూలన ఉన్న రోడ్డు కాదు.. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం రాకపోకలు సాగించే జనసంచార ప్రాంతంలో మురుగు ఇలా ఉంటే కార్పొరేషన్‌లోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలో ఉందో అని అనుమానం వ్యక్తం చేయాల్సి వస్తుందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు బైపాస్ రోడ్డును ఛీ పాడ్ రోడ్డుగా లేకుండా డ్రెయినేజీ నిర్మించి మురుగు నుంచి ఉపశమనం కల్పించాలని నగర వాసులు, వాహనదారులు వేడుకుంటున్నారు.

డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి..



నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే, విద్యార్థులు వసతిభవనం ఎదురుగా ఉన్న బైపాస్‌రోడ్డును మురుగు సమస్య లేకుండా బాగు చేయాలని, వర్షం వచ్చినప్పుడే కాకుండా మామూలు సమయంలో సైతం మురుగు నీరు రోడ్డుపై పారుతుందని డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి సమస్య లేకుండా చూడాలి.

– బి.తిరుపతిరావు, ఖమ్మం

ముక్కు మూసుకోవాల్సిందే..



నగరంలోనే పెద్ద రోడ్డుగా అనేక జిల్లాలకు, రాష్ట్రాలకు వారధిగా ఉన్న బైపాస్ రోడ్డులో ముక్కు మూసుకుని కాకుండా ప్రశాంతంగా ప్రయాణం సాగించే విధంగా మురుగు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలి. కొంతమేర డ్రెయినేజీ నిర్మించి వదిలేయడంతో మురుగు నీరు రోడ్డుపై చిందులు వేస్తుంది. అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించాలి.

– గొడ్డెటి మాధవరావు, ఖానాపురం

పారిశుద్ధ్యంలో అలసత్వం వహిస్తే చర్యలు

- మేయర్ పునుకొల్లు నీరజ



వాకర్లతో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగర పాలక సంస్థ పరిధిలో సిబ్బంది పారిశుద్ధ్య పనుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని, రోడ్ల వెంట వ్యర్థాలు కనిపించొద్దని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. శనివారం కేఎంసీ కార్యాలయంలోని మేయర్ సమావేశ మందిరంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌ల వారీగా పారిశుద్ధ్య పనులపై సమీక్షించిన మేయర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో డ్రెయినేజీల్లో వ్యర్థాలు అడ్డుపడి మురుగు రోడ్లపైకి చేరే ప్రమాదం ఉందని, ముందస్తుగానే డ్రెయినేజీలన్నింటిని శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు.

వాకర్స్ ప్యారడైజ్ పరిశీలన..

మినీ లకారం ట్యాంక్‌బండ్ (వాకర్స్ ప్యారడైజ్)ను మేయర్ నీరజ సందర్శించారు. వాకింగ్‌ట్రాక్‌లో నడుస్తూ స్థానిక సమస్యలను వాకర్స్ నుంచి అడిగి తెలుసుకున్నారు. ట్యాంక్‌బండ్‌పై నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలన్నారు. వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం ట్రాక్ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. 41వ డివిజన్‌లో పెద్దకాల్వలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. 11వ డివిజన్‌లో కాలువ పూడిక తీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ముజ్జుగూడెం సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపు



సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ అధికారులు

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు, రైతులు విద్యుత్ వినియోగం పెరగటంతో అధికారులు సామర్థ్యం పెంచారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు సబ్‌స్టేషన్‌లో శనివారం 5 మెగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ గల కెపాసిటీ స్థాయిని ఏర్పాటు చేశారు. ముజ్జుగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గతంలో 3.15 కెపాసిటీ ఉండగా లోడ్ ఎక్కువ కావటంతో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో దాదాపు 1,000 మంది రైతుల విద్యుత్ కనెక్షన్‌లకు, గ్రామాల్లోను విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో కేపాసిటీ స్థాయిని పెంచారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ డీఈలు చింతమళ్ల నాగేశ్వరరావు, బీ.పవార్, ఏడీ లు కోట్యానాయక్, రామదాసు, రాజారత్నం, ఏఈ కె.రామారావు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



మాట్లాడుతున్న నిర్వాహకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం–బీవీకే ఆధ్వర్యంలో నిర్వహించే నెలనెలా ఉచిత వైద్యశిబిరంలో భాగంగా జులై 6న నిర్వహించే క్యాంపులో ఉచితంగా కేన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు నిర్వాహకులు బీవీకే చైర్మన్ వై.శ్రీనివాసరావు, ప్రకాష్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అధినేత బత్తినేని స్వాతిలు తెలిపారు. శనివారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ శిబిరంలో బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, కళ్లు సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రకాష్ ప్రాజెక్ట్స్ వారితో కలిసి మహిళల్లో కేన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ప్రకాష్ ప్రాజెక్ట్స్ అధినేత బత్తినేని స్వాతి మాట్లాడుతూ.. బ్రెస్ట్, గర్భాశయ కేన్సర్‌తో మహిళలు ప్రాణాలను కోల్పోతున్నారని, ఈ వ్యాధిని మొదటి స్టేజీలోనే గుర్తిస్తే చికిత్స చేయించుకొని వ్యాధిని జయించవచ్చన్నారు. పూర్తి సమాచారానికి 9866232511, 9573691669, 9908906720 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వై.విక్రమ్, ప్రకాష్ ప్రాజెక్ట్స్ బాధ్యులు భీమవరపు పుల్లారావు, నాయకులు బోడపట్ల సుదర్శన్, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, ఎస్‌కె అఫ్జల్ పాల్గొన్నారు.

క్రీడాకారిణిని అభినందించిన డీవైఎస్‌ఓ

ఖమ్మంస్పోర్ట్స్: ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఉమెన్స్ లీగ్ ఉషూ పోటీలు కర్ణాటకలోని బాగల్‌కోటలో ఇటీవల జరగగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న పాడకంటి పవిత్రచారి నాన్ దావో ఈవెంట్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా స్టేడియంలో శనివారం ఆమెను జిల్లా యువజన క్రీడల అధికారి టి.సునీల్‌రెడ్డి ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ పి.పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

కామేపల్లి: 1–19 ఏళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీఓ రవీందర్, పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలిత, వైద్య సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచి శ్రీశ్రీ కవిత్వం



శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: శ్రీశ్రీ కవిత్వం సమాజానికి దిక్సూచి లాంటిదని పలువురు అన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి శనివారం కవులు, రచయితలు, మేధావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాకవి తెలుగు సాహిత్యం ఎన్నటికీ మరువలేనిదని కొనియాడారు. ముప్పా శ్రీనివాసరావు, రవి మారుత్, ఐవీ రమణారావు, ముదిరెడ్డి వీరారెడ్డి, కాంతారావు, అట్లూరి వెంకటరమణ, పగిడిపల్లి, వెంకటేశ్వరరావు, కేసా వీరన్న, టీవీ అప్పారావు, శశిధర్ రెడ్డి, మతీన్, నాగేంద్రకుమార్, రౌతు రవి, శ్రీనివాస్, సూఫీ, ఇబ్రహీం, నిర్గుణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయాల్లో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పలు చోట్ల అన్నదానం, రక్తదాన శిబిరం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవన్‌టౌన్: జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఖమ్మంసహకారనగర్/ ఖమ్మం వైద్యవిభాగం: ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో అన్నదానం



నేలకొండపల్లిలో..



తిరుమలాయపాలెంలో..

సన్మానం



హోంగార్డ్‌ను సత్కరిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ పొందిన మహిళ హోంగార్డు సంధ్యా రాణిని సీపీ సునీల్ దత్ శనివారం సత్కరించారు. సుదీర్ఘకాలంగా సీపీ కార్యాలయంలోని ఇన్‌వర్డ్ సెక్షన్‌లో బాధ్యతాయుతమైన ఆమె సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఆర్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ దత్తురామ్, హోంగార్డ్ ఆఫీసర్స్ సంఘం నాయకులు రఫీ, నీరజ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–5 ఏఈ ఆపరేషన్స్ జే.ప్రభాకర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కమాన్ బజార్, వల్లాల వారి వీధి, రావిచెట్టు బజార్, మజీద్ ఏరియా, స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

టౌన్–2 సెక్షన్ పరిధి బుర్హాన్‌పురం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని ఎన్ఎస్‌టీ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 8:30 నుంచి 10:30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఆపరేషన్స్ నాగేశ్వరరావు తెలిపారు. దీంతో సరితా క్లినిక్, బాలాజీనగర్, లెనిన్‌నగర్, బాబూరావు పెట్రోలు బంక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీపీఐలో చేరిక

ఖమ్మంరూరల్: నిత్యం పేదల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేస్తూ వారికి ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శనివారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో జరిగిన సమావేశంలో సురేష్ మాట్లాడారు. ఈ మేరకు బీఆర్ఎస్ నుండి పలు కుటుంబాలు సీపీఐలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మిడకంటి చినవెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, పొన్నెకంటి అఖిల్, వినోత్, బ్రహ్మం, ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ఖమ్మంస్పోర్ట్స్: నేటి ఆధునిక జీవన విధానానికి అలవాటు పడిన ప్రజలు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారని, వీటన్నింటికీ సంపూర్ణ పరిష్కారమే యోగా అని డాక్టర్ సామినేని సీతయ్య పేర్కొన్నారు. శనివారం పెవిలియన్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా వాకర్స్ అసోసియేషన్, పాదం యోగా ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన ఉచిత యోగ శిక్షణా తరగతులలో యోగ నిపుణులు వివిధ ఆసనాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

రిజర్వేషన్ల పెంపుదలకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రస్తుత సమకాలిన పరిస్థితుల నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు పెంపుదలకు ఉద్యమించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం రిజర్వేషన్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు అంశంపై నగరంలోని ఐఎంఏ హాలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భద్రునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పలువురు మాట్లాడారు. అసమానతలు తొలగిపోనంతకాలం రిజర్వేషన్ల అవసరంఎంతో ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తూ రాజ్యాధికారం కోసం పోరాడాలన్నారు. ఈ సదస్సులో హైకోర్టు న్యాయవాది ఎండి.సాధిక్అలీ, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు, ప్రొఫెసర్ ప్రబంజనయాదవ్, డాక్టర్ ఆయేషా సుల్తానా, ఎం.నరేందర్‌గౌడ్, ఉపేందర్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి ఉపేంద్రాబాయి, ఝాన్సీ, గౌరవాధ్యక్షురాలు షేక్ నజీమా, సోమన్న, మీగడరామారావు, జగదీష్, జంగిపల్లి రవి, రమేష్‌నాయక్, వీరన్న , రవీందర్‌నాయక్, నాగయ్య, స్పందన, జ్యోతి, జాన్‌బీ, త్రివేణి, పార్వతి, భవాని, నాగరాజుయాదవ్, శ్రీనివాస్‌నాయక్, నాగేశ్వరరావు, కల్పన, రాము పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం నుంచి వీరాంజనేయ స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల వార్షిక పవిత్రోత్సవ సహిత బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే సుప్రభాతం, ప్రాబోధక సేవలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ నర్సింహారావు పర్యవేక్షణలో ఉప ప్రధానార్చకులు ఎస్‌బీ కృష్ణమాచార్యులు, అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రతిభ చాటిన విద్యార్థిని



అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల సీఈసీ విద్యార్థిని షేక్.ఆసిఫా అక్సెంచర్ బహుళ జాతి కంపెనీలో ప్యాకేజ్డ్ ఆఫ్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌గా ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు శనివారం తెలిపారు. రూ.11లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్, సిబ్బంది అభినందించారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

ఖమ్మం లీగల్: ఇటుక బట్టీల వద్ద చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టం కఠినంగా పరిగణిస్తుందని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఎం.వలరాజు తెలిపారు. ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రకాష్ నగర్‌లోని ఇటుక బట్టీ వద్ద న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ సమన్వయకర్త కె శ్రీనివాస్ బాలల హక్కులు పరిరక్షణ అంశాలను వివరించారు.

అంగన్‌వాడీకి వితరణ



ఫ్యాన్ అందజేస్తున్న ఉస్మాన్

ఖమ్మంమయూరిసెంటర్: వైరా మండలం రెబ్బవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్‌తోపాటు విద్యుత్ సామగ్రిని ఖమ్మం నగర 21వ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ షేక్ ఉస్మాన్ వితరణగా అందజేశారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, వన్ టౌన్ ఇన్‌చార్జి, కార్పొరేటర్ షేక్ మక్బూల్, బీఆర్ఎస్ నగర ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, 22వ డివిజన్ ఉపాధ్యక్షులు షేక్ సిద్దాసాహెబ్, మైనార్టి నాయకులు షేక్ అబ్దుల్ నబి, షేక్ హుస్సేన్ బి, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

ఖమ్మంఅర్బన్: ఖానాపురం సెంటర్‌లోని ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఉన్న డ్రెయినేజీలో పేరకుపోయిన చెత్తను శనివారం తొలగించారు. కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీటీ

కామేపల్లి: కామేపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా జి.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ శంకర్ ఇటీవల పదవీ విరమణ చేయగా ఆయన స్థానంలో ఏన్కూర్ మండలం నుంచి బదిలీపై శ్రీనివాసరావు వచ్చారు.

లీకుల భగీరథ..



వృథాగా పోతున్న తాగునీరు

ఖమ్మంవన్‌టౌన్: మిషన్ భగీరథ పథకం కింద నగరంలో వేసిన పైపులు పలుచోట్ల పగిలి నీరు వృథాగాపోతోంది. నగరంలోని 14వ డివిజన్ చెరుకూరి మామిడితోట రోడ్డు మధురానగర్ రోడ్డు నంబర్ 4లో పైపు లీకై రోడ్డుపై నీరు వృథాగా పోతుంది. రోడ్డుపై ఉన్న గుంతలలో నీరు నిలిచి పాదాచారులకు, వాహనదారులకు సైతం ఇబ్బందిగా మారింది. అసలే అరకొర వర్షాలతో రిజర్వాయర్‌లలో నీరు అడుగంటడంతో పాటు భూగర్భ జలాలు సైతం పాతాళానికి పడిపోయిన ఈ తరుణంలో నీరు వృథాగా పోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది.